

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట



బుధవారం, ఏప్రిల్ 1, 2026 పేజీలు:8


## మహాలక్ష్మి పథకం మహిళలకు

# ఆర్థిక భరోసా

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
### రూ.10,000 కోట్ల ప్రయాణ ఖర్చు ఆదా




**గద్వాల మార్చి 31(ప్రజా జ్యోతి ప్రతినిధి)** :జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అమలు చేసిన తొలి సంక్షేమ పథకాలలో మహాలక్ష్మి (ఉచిత బస్సు) పథకం ఒకటని తెలిపారు.మహిళలకు స్వేచ్ఛ,భరోసా కల్పిస్తూ వారి ఆర్థిక భారాన్ని తగ్గించి సాధికారతను పెంపొందిస్తున్నదని పేర్కొన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదై,దాదాపు ?10,000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా అయ్యాయని తెలిపారు.మహిళలు ఉద్యోగాలు,వైద్య సేవలు,విద్య కోసం

## అమలవుతున్న సంక్షేమ పథకాలను

# ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు పెద్ద ఎత్తున నిర్వహించాలి
- ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక) పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



## మహాలక్ష్మి పథకం మహిళల సాధికారతకు

# బలమైన అండ

### ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్థికంగా, సామాజికంగా మహిళల ఎదుగుదల




మహబూబ్‌నగర్, మార్చి 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహిళల ఆర్థిక, సామాజిక భద్రతతో పాటు సాధికారతకు మహాలక్ష్మి పథకం ద్వారా కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఎంతో దోహదపడుతోందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు.
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల

## ప్రజాపాలన ప్రతిబింబించేలా

# గ్రామసభ నిర్వహణ

-డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

-ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలి

-ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు,

-గ్రామసభ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించిన డిప్యూటీ సీఎం



# ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహణ

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చి 31 (ప్రజా జ్యోతి)

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు, ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ, వార్డుసభల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణా రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియోసమావేశానికి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలలో ప్రజలకు అందించే సమాచారం ఒకే రీతిన ఉండాలని, గ్రామ సభలకు వార్డు మెంబర్ నుంచి ఎంపీ, మంత్రుల వరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. గ్రామసభలో ముఖ్యమంత్రి సందేశం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డు, సన్న బియ్యం సరఫరా, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్లు వంటి వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారుల చేత గ్రామ సభలలో మాట్లాడించాలని అన్నారు. జూన్ 2 నుంచి ప్రారంభించే ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అల్పాహార కార్యక్రమంతో పాటు, పాలు, రాగి జావా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని అన్నారు. సాంస్కృతిక శాఖ కళాకారులను ఉపయోగిస్తూ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు. గ్రామాలకు ప్రభుత్వం భారీ ఎత్తున విడుదల చేసిన నిధులను గ్రామ అభివృద్ధికి వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు సీఎస్ కె.రామకృష్ణా రావు మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చ్ 6 నుంచి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైల్స్ సత్వర పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, అదే స్ఫూర్తితో ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలు విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి జిల్లాలో గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి అనే అంశంపై రిపోర్టు అందించాలని కలెక్టర్ లను ఆదేశించారు. గ్రామ సభలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని, స్థానిక ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా గ్రామసభలో ఉండాలని అన్నారు. గ్రామ సభలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియ జేయాలని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని అన్నారు.
గ్రామసభ తరహాలో మున్సిపాలిటీ వార్డులో సైతం సభలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత బడ్జెట్ లో ప్రతిపాదించిన వివిధ పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా గ్రామ, వార్డు సభలలో ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలందరికీ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం తెలిసే విధంగా వార్డు సభలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలు నిర్బహణపై ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ మరియు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం, జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియమితులైన ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించి, నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.
జిల్లాలోని ప్రజలందరూ గ్రామ సభలకు హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలను వెల్లడించి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్థిక భరోసా

ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటున్నారని అన్నారు. జోగులాంబ గద్వాల బస్ స్టేషన్ పరిధిలో గత రెండేళ్లలో సుమారు ?110 కోట్ల ప్రయాణ చార్జీని మహిళలు ఆదా చేసుకున్నారని, దాదాపు 28 లక్షల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని వెల్లడించారు. రోజుకు సగటున ?13 లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తూ నాణ్యమైన రవాణా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నెల ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉపముఖ్యమంత్రి అవసరమైన బడ్జెట్‌ను సమకూర్చుతూ పథకం నిరంతరంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. అదనంగా మండల సమాఖ్యల ద్వారా బస్సులను అద్దెకు ఇవ్వడం ప్రారంభించామని, భవిష్యత్తులో మరిన్ని బస్సులను ఆర్టీసీకి అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు.
మహిళల అభిప్రాయాలు:
మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం వల్ల తమ రోజువారీ ఖర్చులు గణనీయంగా తగ్గాయని మహిళలు తెలిపారు. ప్రతి నెల ఆదా అవుతున్న డబ్బును కుటుంబ అవసరాలకు వినియోగిస్తున్నామని, ఈ పథకం తమకు ఆర్థిక ఉపశమనం కల్పించడంతో పాటు స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ బస్ స్టాండ్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, పార్కింగ్‌ను క్రమబద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నిబంధనలు పాటించని పక్షంలో జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జయలక్ష్మి, ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత, ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జీవితంలో విద్యార్థి దశ కీలకం

నాగర్ కర్నూల్ : మార్చ్ 30 (ప్రజా జ్యోతి)రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ గారి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ చైర్మన్ మరియు సెక్రెటరీ ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ పట్టణంలోని లోని జ్ఞానేశ్వర వాస్తల్య మందిరం చిల్డ్రన్ హోమ్ (బాలికలు)ను శ్రీ శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సందర్శించారు.
ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడుతూయోగ క్షేమాలను తెలుసుకుని మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని అడిగి వారిచే పాటలు పాడించి ఉత్సాహపరచడం జరిగింది. జీవితంలో విద్యార్థి దశ అనేది కీలక దశ కాబట్టి అందరూ చక్కగా చదువుకొని జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని మీకు ఏమైనా సహాయం కావాలంటే మా సంస్థ తరఫున సహకారాలు అందిస్తామని అన్నారు. అనంతరం చిన్నారులకు బిస్కట్ ప్యాకెట్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు, చిన్నారులు పాల్గొన్నారు.



## మహాలక్ష్మి పథకం మహిళల సాధికారతకు

# బలమైన అండ

కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో మంగళవారం నిర్వహించిన “మహాలక్ష్మి సంబరాలు” కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నదని తెలిపారు. 2026 మార్చి 29 నాటికి సుమారు 290 కోట్ల మహిళల ప్రయాణాలు నమోదవడంతో పాటు రూ. 10,000 కోట్ల బస్సు ఛార్జీల ఆదా రూపంలో మహిళలకు లాభం చేకూరిందని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల మహిళలు పట్టణాలు, నగరాలకు సులభంగా చేరుకుని ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్యా అవకాశాలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. దీని వలన వారు ఆర్థికంగా బలపడటమే కాకుండా సామాజికంగా, విద్యాపరంగా కూడా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహబూబ్‌నగర్ మేయర్ గుమాల మమత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. తాను మేయర్‌గా ఎన్నిక కావడం మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు. డీఆర్డీవో నర్సింహులు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండల మహిళా సమాఖ్యకు ఒక్క ఆర్టీసీ బస్సు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని తెలిపారు. ఇప్పటికే కొన్ని మండలాలకు బస్సులు అందించగా, మిగతా మండలాలకు కూడా త్వరలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కోసం ప్రభుత్వం రూ. 4 కోట్ల వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 10 డిపోలలో 960 ఆర్టీసీ బస్సుల ద్వారా మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. దీని వలన సుమారు రూ. 1064 కోట్ల బస్సు ఛార్జీలను మహిళలు ఆదా చేసుకున్నారని వివరించారు. జిల్లాలో ఇప్పటికే 100 కొత్త బస్సులను ప్రవేశపెట్టామని, మరిన్ని రూట్లలో సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు తమ అనుభవాలను పంచుకున్నారు. సుశీల అనే వృద్ధ మహిళ రోజూ కూరగాయల వ్యాపారం కోసం ప్రయాణిస్తూ ఉచిత బస్సు సౌకర్యం వల్ల రోజుకు సుమారు రూ. 150 వరకు ఆదా అవుతోందని తెలిపారు. నవాబ్‌పేట్ మండలానికి చెందిన కల్పన అనే నర్సు ప్రతి నెలా సుమారు రూ. 3,000 వరకు ఆదా చేసుకుని ఆ మొత్తాన్ని తన పిల్లల విద్య కోసం వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

# రూట్ మ్యాప్ మార్చి లాభాల రాజకీయాలు..?

### ఫ్లెక్సీ బిల్లులు కట్టలేక నేతల అవస్థలు, కాలనీవాసుల ఆగ్రహం

**జడ్చర్ల, మార్చి 31, ప్రజా జ్యోతి**

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట జోకి నగర్ ప్రాంతంలో మురుగు కాల్వల నిర్మాణం వివాదాస్పదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా కాల్వల మార్గాన్ని మార్చి నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా 25వ వార్డులో చేపడుతున్న ఈ పనుల్లో అసలు ఆమోదించిన రూట్ మ్యాప్‌ను పక్కన పెట్టి, కొందరు ప్రభావశీలుల ప్రయోజనాల కోసం మార్పులు చేసినట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఒక ఇంటి ముందు నుంచి కాల్వ వెళ్లకుండా ఉండేందుకు స్థానిక నేతలు జోక్యం చేసుకున్నారని, దీనికి ప్రతిగా ఫ్లెక్సీ ప్రింటింగ్ బిల్లుల విషయంలో రాజీ కుదిరిందన్న ఆరోపణలు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి.
ఈ పరిణామాలు మున్సిపల్ పరిపాలన పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఎస్టిమేషన్ మరియు ప్రణాళికల ప్రకారం పనులు జరుగుతున్నాయా, లేక వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా అన్న దానిపై ప్రజల్లో చర్చ నడుస్తోంది. కాల్వల మార్గం మార్పు వల్ల భవిష్యత్తులో నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వాస్తవ పరిస్థితులను వెల్లడించి, అవసరమైతే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



# అంగవైకల్యాన్ని జయిస్తున్న చిన్నారి పట్టుదల అందరికీ ఆదర్శం



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చి 31 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, అన్నాసాగర్ గ్రామానికి చెందిన ఒక చిన్నారి అక్షర ప్రభుత్వ పాఠశాల లో 4వ తరగతి చదువుతుంది. తన పట్టుదలతో అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఈ బాలికకు సరిగా నడవడం రాకపోయినా, చదువుపై ఉన్న ఆసక్తి మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ప్రతిరోజూ మండే ఎండలో, దాదాపు ఒక కిలోమీటర్ దూరం నుంచి తన బడి బ్యాగును మూడు చక్రాల చెక్క బండి సహాయంతో నెట్టుకుంటూ పాఠశాలకు చేరుతోంది. అంగవైకల్యం తన చదువుకు అడ్డుకాదు అని నిరూపిస్తూ, ఆమె చూపుతున్న ధైర్యం, పట్టుదల గ్రామస్థులనే కాకుండా అందరినీ కదిలిస్తోంది. ఈ చిన్నారి పరిస్థితిని గమనించిన అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, ఆమెకు అవసరమైన సౌకర్యాలు, సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. చదువుపై ఉన్న ఈ చిన్నారి తపన ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలవాలని ఆశిస్తున్నారు.



# 2 లక్షలు రైతు రుణమాఫీ చెయ్యాలి

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చి 31( ప్రజా జ్యోతి) ఈరోజు తాసిల్దార్ కార్యాలయం నారాయణపేట నందు భారతీయ కిసాన్ సాంగ్ నారాయణపేట పట్టణ మండల కమిటీ పిలుపుమేరకు గతంలో ప్రభుత్వము ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేస్తా అని హామీ ఇచ్చి ఇంతవరకు చేయని కారణంగా బ్యాంకులో రుణాలకు వడ్డీలు పెరిగిపోయి అప్పులు ఎక్కువ కావడం వల్ల రైతాంగం ఆందోళన చెందుతుంది అదేవిధంగా ఈ ప్రాంతంలో వ్యవసాయ పంటలు ఆరుగాలం పండించిన అడవి పందులు జింకలు, నెమలిల్లా కోతుల వల్ల పంటలు నాశనం అవుతున్న సందర్భంగా ఇట్టి విషయాన్ని భారతీయ కిసాన్ సాంగ్ దృష్టి సాధించి తాసిల్దార్ అమరేందర్ కృష్ణ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగినది ఇట్టి విషయాన్ని నగర ఉపాధ్యక్షులు బాపనపల్లి రాము తంగు విశ్వనాథ్ రెడ్డి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గంప ఆధ్వర్యంలో నారాయణపేట బైరం కొండ జిల్లాల పూర్ జాజపురం షేర్నపల్లి పేరపల్ల పగిడి మారి గడిమున్కన్పల్లి సంబంధించిన రైతులు పాల్గొని తాసిల్దార్ గారి ముందు తమ యొక్క ఆవేదన వ్యక్తపరచడం జరిగింది కాబట్టి ప్రభుత్వం వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతు కుటుంబాలని ఆదుకోవాలని రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపాలని



కోరుతున్నారు రైతు ఆర్థికంగా బాగుంటేనే ఈ ప్రాంతం బాగుంటుంది రైతు ఇబ్బంది పడితే ఈ ప్రాంతం అధోగతి అవుతుంది రాత్రింబవళ్లు కష్టపడి పంటలు పండించి నిరంతరంగా ఆహార ధాన్యాలు పండించిన రైతుల బాధలు పరిగణాలకు తీసుకొని వెంటనే మాఫీకి అనుమతి ఇవ్వాలని అదేవిధంగా ఈ ప్రాంత అడవి జంతువులను నిర్మూలించి ఈ ప్రాంతం నుండి తరలించాలని ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది

# కాషాయం పతాకం ఎగురేసిన చిన్నంబావి మండల బీజేపీ నాయకులు.

**చిన్నంబావి.మార్చి 31 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండలశీలోని కాషాయం జెండా ఎగురేసిన బీజేపీ శక్తివంతం దిశగా కీలక అడుగు పడింది. కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ “పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్” కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య జెండా ఆవిష్కరించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రారంభ వేడుక నుంచే కార్యకర్తల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. కాషాయం జెండా ఎగురుతుండగా నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు, జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు, భరత్ ప్రసాద్, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూర్ శివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గారి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు జలాల్ శివుడు హాజరై కార్యక్రమానికి మరింత ప్రాధాన్యం చేకూర్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...

గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో ఈ ప్రశిక్షణ మహా అభియాన్ కీలకమని స్పష్టం చేశారు. కార్యకర్తలు సిద్దాంతపరంగా, కార్యాచరణపరంగా బలపడేందుకు ఇది ఒక శక్తివంతమైన వేదిక అని తెలిపారు. ప్రతి కార్యకర్త ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు సంపత్, సత్యరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు సుగుణమ్మ, గణేష్ రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకుడు మేకల చెన్నయ్య యాదవ్, గూడెం శివ, మోడల్ శివ, డి. వెంకటన్న, శివశంకర్, కిరణ్, విజయ్, స్వాములు, ఆంజనేయులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తానికి, చిన్నంబావి మండలంలో నిర్వహించిన ఈ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమం బీజేపీకి కొత్త ఉత్సాహాన్ని నింపుతూ, భవిష్యత్ రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదగడానికి పునాది వేస్తుందని స్థానికంగా చర్చ జరుగుతోంది.



# అడ్వకేట్స్ నూతన చట్టాన్ని ఆమోదించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చి 31 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల పై జరుగుతున్న దాడులను ఆస్తుల సంరక్షణను దృష్టిలో ఉంచుకొని మెరుగైన చర్యలు తీసుకుంటుందని భావించినారు. కానీ అడ్వకేట్స్ వామన్ రావు దంపతుల హత్య అనంతరం చాలా మంది అడ్వకేట్స్ పై హత్యలు మరియు దాడులు జరిగినవి. ఈ క్రమంలో చాలా రోజులుగా అడ్వకేట్స్ ప్రొటెక్షన్ ఆక్ట్ కొరకు న్యాయవాదులు పోరాటం చేస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆనాడు పిసిసి ప్రెసిడెంట్ గా ఉన్నటువంటి ప్రస్తుత మన ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారు నారాయణపేట వచ్చిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం వస్తే అసెంబ్లీలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమల్లోతెస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాటకు కట్టుబడి గౌరవ ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కర్ణాటక మరియు గుజరాత్ రాష్ట్రాల్లో అమలవుతున్న అడ్వకేట్ ప్రొటెక్షన్ ఆక్ట్ మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఒక మంచి సంకల్పంతో నిన్న ఆదివారం దుద్దిల్ల శ్రీధర్ బాబు మంత్రివర్యులు ద్వారా అసెంబ్లీలో ప్రవేశ పెట్టడం జరిగింది. ఇట్టి బిల్లును చట్టముగా అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. ఇట్టి బిల్లు వలన కేవలం అడ్వకేట్ మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు రక్షణ మరియు వారి ఆస్తుల పరిరక్షణ కూడా కల్పిస్తూ చట్టం రూపకల్పన చేయడం యావత్ తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్స్ ప్రయోజనం పొందినారు. ఈ చట్టాన్ని అమలు అమలు తీసుకురావాలని గతంలో రాష్ట్రంలోని న్యాయవాదులు ఎన్నో నిరసన చేపట్టిన ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రులు ఎంతో చొరవ చూపి చట్టాన్ని సాధించడం జరిగింది. వారందరికీ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ తరపున మరియు రాష్ట్రంలోని న్యాయవాదులు అందరి తరపున రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి , మంత్రివర్యులు శ్రీహరి గారికి మరియు దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి నారాయణపేట శాసనసభ్యులు చిట్టెం పర్నికా రెడ్డి , మహబూబ్నగర్ శాసనసభ్యులు శ్రీనివాసరెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు మరియు కృతజ్ఞత అభినందనలు.

ఇట్టి నారాయణపేట జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ రాజేశ్వర్ గౌడ్ అడ్వకేట్, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి డి .శివరాజ్ అడ్వకేట్, వైస్ ప్రెసిడెంట్ మునావర్ అడ్వకేట్ మరియు జాయింట్ సెక్రెటరీ దినేష్ వర్మ అడ్వకేట్, నారాయణపేట మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు రాజ్ ఘాట్ మరియు నాయకులు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అడ్వకేట్ యాక్ట్ అమలులో ఇచ్చిన సందర్భంగా అడ్వకేట్స్ మిఠాయిలు పంచుకున్నారు.

# నర్వ తైబజారు వేలం లక్ష అరవై రెండు వేలు

**నర్వ మార్చు 31 ప్రజా జ్యోతి నర్వ**

నారాయణపేట జిల్లా నర్వ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో కలవారం తైబజార్ వేలం నిర్వహించడం జరిగింది . ఇట్టి వేలం సర్కారీ వారి పాట 99,385/- రూపాయలతో ప్రారంభించగ 11 మంది వేలంలో పాల్గొని అత్యధికంగ 1,62,000 ? రూలకి మ్యాతరి లక్ష్మన్న (ఆటో ) గారు వేలం దక్కించుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హనుమంత రెడ్డి, ఉపసర్పంచ్ దండు అజయ్, పంచాయతీ కార్యదర్శి బుచ్చిరెడ్డి, పంచాయతీ పాలక సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు



# ఏప్రిల్ 3న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

**– క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**– అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎం విజేందర్ యాదవ్**



**అచ్చంపేట మార్చి 31 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా అట్లాటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3న క్రీడాకారుల ఎంపిక ఉంటుందని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం విజేందర్ యాదవ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలా పోగుల స్వాములు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాస్థాయి ఎంపికలు వచ్చే నెల ఏప్రిల్ 3వ తేదీన ఉదయం 8 గంటలకు అచ్చంపేట పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల మరియు పాఠశాల ఆవరణలోని మైదానంలో నిర్వహించబడతాయి తద్వారా జిల్లా క్రీడాకారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. జిల్లా స్థాయిలో ప్రతిభా కనబరిచిన క్రీడాకారులు ఏప్రిల్ 11, 12 తేదీలలో హనుమకొండ జిల్లాలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే 11 వ తెలంగాణ రాష్ట్ర అండర్ 20 బాల బాలికలు మరియు 20 సంవత్సరాల పైబడిన పురుషులు, మహిళల జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయి అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్స్ లో పాల్గొని అర్హత పొందుతారని స్పష్టం చేశారు. కాగా 20 సంవత్సరాల బాల బాలికలు 26, 4,26 నుంచి 27, 4, 27 వరకు మధ్యలో జన్మించి ఉండాలని సూచించారు. ఈవెంట్స్ 100, 200,4శీశీ,800,1500, త్రీ కె ఫైవ్ కే టెన్ కే మరియు డిస్కస్ త్రోస్ ఈవెంట్లు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ యొక్క అవకాశాన్ని ప్రతిభ వంతులైన క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ యొక్క క్రీడల్లో పాల్గొని నాగర్ కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు వారు విజ్ఞప్తి చేశారు

# ఆస్పిరేషనల్ బ్లాక్ లక్ష్యాల్లో 100% సాధనకు కృషి చేయాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా



గద్వాల మార్చి 31(ప్రజా జ్యోతి ప్రతినిధి):గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో నిర్దేశించిన 39 సూచికల్లో వంద శాతం లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా జనవరి 28 నుంచి ఏప్రిల్ 14 వరకు చేపట్టిన "సంపూర్ణత అభియాన్ 2.0" కార్యక్రమంపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 6 నెలల నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అదనపు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.తాగునీటి సౌకర్యాన్ని పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు.నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ భవనాలు,ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.పశువులకు ఎఫ్ఎండీ(ఫుట్ అండ్ మౌత్ డిసీజ్)టీకాల కార్యక్రమాన్ని లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు.వైద్య ఆరోగ్య శాఖ పనితీరు, వైద్య పరీక్షలలో వెనుకబడుతున్న అంశాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు.ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంకు సంబంధించి ప్రతివారం మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని,గట్టు బ్లాక్ ర్యాంకింగ్ మెరుగుపడేందుకు అధికారులు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు.జిల్లా అధికార యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి,డిడబ్ల్యూఓ సునంద,డీఈవో విజయలక్ష్మి, గట్టు ఎంపీడీవో చెన్నయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన గ్రామ సర్పంచ్

**-- నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశం**





మద్దూర్ మండల ప్రతినిది ప్రజాజ్యోతి మార్చి31:నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి గ్రామ సర్పంచ్ సాయప్ప,ఉప సర్పంచ్ సి.భీమమ్మ మరియు గ్రామ కార్యదర్శి యండి.షాజిల్ భోజనం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.విద్యార్థులతో కలిసి మాట్లాడి భోజనాలు ఎలా ఉన్నాయని విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ,విద్యార్థులకు ప్రతిరోజూ శుభ్రంగా,పోషకాహారం కలిగిన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.ఆహారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.వంటగది పరిశుభ్రత,ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా వారికి అందుతున్న ఆహారం నాణ్యతపై ప్రత్యక్షంగా అవగాహన పొందామని తెలిపారు.భవిష్యత్తులో కూడా పాఠశాలలో అన్ని సౌకర్యాలు మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఖాజీపూర్ గ్రామ పాఠశాల సిబ్బంది,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# భావోజి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

**:జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్**





మద్దూర్ మండల ప్రతినిది ప్రజాజ్యోతి మార్చి31:నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలం, తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీ నుండి 4 వ తేదీ వరకు నిర్వహించబడుతున్న ప్రసిద్ధ భావోజి జాతర సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు. మంగళవారం రోజు జాతర నిర్వహణను సమగ్రంగా పరిశీలించిన ఎస్పీ, పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వేలాది మంది భక్తులు హాజరయ్యే ఈ జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తేరు కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నలుగు దిక్కుల రోప్ పార్టీలు ఏర్పాటు చేయాలని, ముందస్తు బందోబస్తు ప్లాన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యేక ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయబడినట్లు, వాహనాల పార్కింగ్ కోసం వేర్వేరు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.జాతరలో భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటి సంఘటనలను అరికట్టేందుకు మఫ్టీలో (సివిల్ డ్రెస్సులో) పోలీసులను మోహరించామని తెలిపారు. అదనంగా, మహిళలు మరియు పిల్లల భద్రత కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు క్యూఆర్టి టీం ఏర్పాటు చేయాలని, జాతర ప్రాంగణంలో ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు, భక్తులు ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.జాతర సమయంలో ప్రజలు పోలీస్ అధికారులతో సహకరించాలని,ట్రాఫిక్ నియమాలను పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్,ఎసిబిఎస్సై నరేష్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రహదారి భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల మార్చి 31(ప్రజా జ్యోతి):ప్రతినిత్యం రోడ్డు ప్రమాదాలతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని,గాయపడుతున్నారని రహదారి భద్రతకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ గుర్తించాలని,అవసరమైన చోట రహదారి భద్రత వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.జిల్లాలో జాతీయ రహదారితో పాటు అంతర్రాష్ట్ర రహదారులు,గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లోనూ ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. రహదారి వైపుకు పెరిగిన ముళ్ల పొదలను తొలగించడం,అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్స్,లైటింగ్ ఏర్పాటు చేయడం,ఇతరత్రా చర్యలతో రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు.ఆయా మండలాల్లోని ఎస్ హెచ్ఓల (స్టేషన్ హౌస్




ఆఫీసర్) వారీగా కూడా రహదారి ప్రమాదాల నివారణకు సమావేశాలు నిర్వహించాలన్నారు.ఇకనుంచి రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని ప్రతి నెల మూడో బుధవారం నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,అదనపు ఎస్పీ శంకర్,ఆర్అండ్ బి ఈఈ ప్రగతి,డిటిఓ వెంకటేశ్వరరావు,సంబంధిత శాఖల ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా అవుతున్న ఫారెస్ట్ భూముల వివరాలు తెలపండి

### ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మంద నరసింహ మాదిగ

**కొల్లాపూర్ మార్చి 31 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామ పరిధిలో ఉన్న నల్లమల ఫారెస్ట్ అడవి ప్రాంతాలు కబ్జా కు గురవుతున్న ప్రభుత్వ భూముల వివరాలు తెలపాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద నరసింహ మాదిగ, కొల్లాపూర్ తాలూకా ఎంఎస్పీ అధ్యక్షులు రాము మాదిగ. కొల్లాపూర్ మండల ఎమ్మార్వో భరత్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు.

కొల్లాపూర్ మండలం ఎల్లూరు అటవీ ప్రాంతాలలోని సర్వే నెంబరు 359 , 360 , 364 , 365 లలోని 45 ఎకరాల భూమి కబ్జాకు గురవుతున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారని ఈ విషయం లో కొల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు పై సర్వే నెంబర్లలో ఎంత భూమి ఉంది..? ఎంత భూమి కబ్జాకు గురవుతున్నది...? సమగ్ర విచారణ వివరాలతో తమకు తెలియజేయాలని .

ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మంద నరసింహ మాదిగ, కొల్లాపూర్ మండల తహసిల్దార్ భరత్ కుమార్ మంగళవారం రోజు లిఖితపూర్వకము గా విజ్ఞప్తి పత్రం ను అందజేశారు.

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద నరసింహ మాట్లాడుతూ. పై సర్వే నెంబర్లు గల భూమిని భూమిలేని పేదలకు భూమి పంచాలి, అలా జరగలేదు అంటే భూమిలోనే ఎమ్మార్పీఎస్ జెండాలు పాతి పేద ప్రజలకు భూములను పంచుతామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద నరసింహ వివరించారు. 1995 సంవత్సరం వరకు ప్రభుత్వ భూములుగా ఉన్న భూములను ఆ తర్వాత ఎలా ప్రైవేటు వ్యక్తుల భూములుగా ఎలా మారాయో అన్న సమాచారాన్ని స్థానిక ప్రజలు ఆరోపించగా ఇట్టి సర్వే



నెంబర్లు గల భూములపై ప్రభుత్వ అధికారులు సమాధానం చెప్పాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మంద నరసింహ లెటర్ ప్యాడ్ మీద లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు, ఇట్టి భూమి ఫారెస్ట్ అడవిగా ఉండేది? అందులో లక్షలాది చెట్లను ఉన్నాయి వాటిని తొలగించి అక్రమంగా భూమి స్వాధీనం చేసుకున్నది ఎవరు. ఇట్టి భూమిని హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీకి చెందిన వారు కొనుగోలు చేశారని ఇక్కడ ఉన్న స్థానిక ప్రజల సమాచారం, పై సర్వే నెంబర్ల ప్రకారం ప్రభుత్వ భూములు, లేక రాజా గారి భూములు? అన్న విషయం పైన మాకు సమాచారం ఇవ్వాలని కొల్లాపూర్ మండల తాసిల్దార్ భరత్ కుమార్ ను ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మంద నరసింహ కోరారు. కార్యక్రమంలో. ఎం ఎస్ పి కొల్లాపూర్ తాలూకా అధ్యక్షులు పుట్టపాగా రాము మాదిగ. పసుపుల రాముడు. దాసరి చంటి. కేతపాగా మధు. తదితరులు పాల్గొన్నారు.

# సలేశ్వరం జాతరకు పటిష్ట బందోబస్తు

### -326 మంది పోలీస్ సిబ్బందితో భద్రత
### -జిల్లా ఎస్పీ డాక్టర్.సంగ్రామ్ సింగ్ జి పాటిల్

**నాగర్ కర్నూల్ : 31 మార్చ్ (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలో ప్రతి ఏటా జరిగే సలేశ్వరం జాతరకు 326 మందిపోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భద్రత ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎస్పీ తెలిపారు.భక్తులు ఏప్రిల్ 01 నుండి 03 వ,తేది వరకు మాత్రమే సందర్శించుకోవడానికి సమయం కేటాయించబడిందని భక్తులందరూ గమనించి నల్లమల్ల డీప్ ఫారెస్ట్ లో దేవుడు కొలువుదీరి ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించి రాత్రి వేళలో కాకుండా పగటి వేళలోనే దేవుని దర్శించుకుని మీ మొక్కును చెల్లించాల్సిందిగా కోరారు.అదేవిదంగా భక్తులందరూ తప్పనిసరిగా వాటర్ బాటిల్ తీసుకొని వెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీఎన్ వెంకటేశ్వర్లు, అచ్చంపేట డిఎస్పి శ్రీనివాసులు,అచ్చంపేట సీఐ నాగరాజు,అచ్చంపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారులు అందరూ పాల్గొన్నారు.



## మంత్రులు మారిన ఎమ్మెల్యేలు మారినా..

### శ్రీశైలం నీటి ముంపు ప్రాంతాల నిర్వాసితుల జీవితాలు మారేది ఎప్పుడు.......



**కొల్లాపూర్ మార్చి 31 ప్రజా జ్యోతి**


ప్రజల కోసం ఎన్నుకోబడిన వారి ఆలోచనలు ఎలా ఉంటుందో అందరికీ తెలుసు. ఎన్నికల సమయంలో మేము అధికారంలోకి వస్తే శ్రీశైలం నీటి ముంపు గురైన నిరుద్యోగులకు కచ్చితంగా న్యాయం చేస్తామని హామీలను ఇచ్చిన నేతలు ఎంతోమంది ఉన్నారు, కానీ నాటి నుండి నేటి వరకు 45 సంవత్సరాలు గడిచిన 98 జీవో నిర్వాసితుల బాధితులను పట్టించుకున్న నాతుడే లేడు. అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీశైలం నిర్వాసితుల గురించి అసెంబ్లీలో మాట్లాడిన ఒక ఎమ్మెల్యే కూడా లేడు, 2019 సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి చిన్నంబాయి సెంటర్లో ఉన్న మరీ చెట్టు క్రింద 98 జీవో నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చారు, కానీ 98 జీవో నిర్వాసితులను ఓట్లను వేయించుకొని ఓడ దాటితే మల్లన్న, దాటినాక బోడ మల్లన్న? అన్న సామెత మాదిరిగా ఉంది రాజకీయ నాయకులు వాగ్దానాలు, 98 జీవో నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన మాట నెరవేర్చకుండానే మాజీ ఎమ్మెల్యే ఐదు సంవత్సరాలు కాలం పబ్బం గడుపుకుని వెళ్లిపోయారు? అనంతరం 1981 సంవత్సరంలో శ్రీశైలం డ్యాం ప్రాజెక్టు నిర్మాణం కొరకు బంగారం లాంటి భూములను ఇండ్లను సర్వస్వం కోల్పోయాం, 1983లో అప్పటి ప్రభుత్వాలు శ్రీశైలం నీటి ముంపు బాధితులకు ఉద్యోగాలు కనిపిస్తామని చెబుతూ 98 జీవోలు జారీ చేశారు, నాటి నుండి నేటి వరకు శ్రీశైలం నిర్వాసితులకు గుండు సున్నా చూపిస్తున్న ప్రభుత్వాలు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న శ్రీశైలం 98 జీవో నిర్వాసిత ఉద్యోగాల పైన రవ్వంతైనా ఆలోచన చేయలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం, పెంట్లవెల్లి మండలం పరిధిలో ఉన్న జటప్రోలు గ్రామంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూలుకు భూమి పూజ చేయడానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి. 98 జీవో నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పిస్తామని బహిరంగ సభలో భరోసా ఇచ్చారు? నాటి నుండి నేటి వరకు శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిన ప్రజాపాలన ప్రభుత్వం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ నిరంతరం ప్రజల కోసం ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తుందని దొంగ మాటలు చెబుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం. శ్రీశైలం 98 జీవో నిర్వాసితుల ఉసురు తగిలి నాశనం అవుతారు అని 98 జీవో నిర్వాసితుల ఆవేదనలు ప్రభుత్వానికి వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయం ఆఫీసులో పలుసార్లు మంత్రి కూడా కలిశాము వారు మమ్ములను స్పందించి మీకు త్వరలోనే న్యాయం చేస్తామని చెప్పారు. అదేవిధంగా వయసు ఉన్నవారికి ఉద్యోగాలు, లేని వారికి నష్టపరిహారము కింద 25 లక్షల రూపాయలు? మా ప్రియతమ నాయకుడు ముఖ్యమంత్రి అధ్వారంలో మీకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.



# అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు పెద్ద ఎత్తున నిర్వహించాలి
- ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక) పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





నాగర్ కర్నూల్ మార్చి 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి గారి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

## ఇంటింటికీ సర్పంచ్ పర్యటన





చిన్నంబావి, మార్చి 31(ప్రజాజ్యోతి)
చిన్నంబావి మండలంలోని అమ్మాయిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడ్ ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఉప సర్పంచ్ ఆలేటి మాధవి మాధవరెడ్డి, వార్డు సభ్యులతో కలిసి గ్రామంలోని వీధులను సందర్శించారు.వీధి దీపాలు, మురుగు కాలువలు, మంచినీటి కొరత, ఇంకుడు గుంతలు వంటి సమస్యలను పరిశీలించారు. ఎస్సీ కాలనీలోని పూరి గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల కష్టసుఖాలను తెలుసుకొని వారికి భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో అర్హులైన వారందరికీ ఇళ్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంగవైకల్యం గలవారికి గౌరవం ఎక్కడ?

- "ఇకనైనా మేలుకోండి... ఐక్య పోరాటమే మార్గం"
- రాష్ట్ర బీజేపీ నేత కురువ చిన్న మల్లయ్య పిలుపు



చిన్నంబావి మార్చి 31 (ప్రజాజ్యోతి)
తెలంగాణ రాష్ట్రంలో అంగవైకల్యం గల వికలాంగుల పరిస్థితి ఇప్పటికీ ఆందోళనకరంగానే కొనసాగుతోంది. సాంకేతికంగా దేశం ముందుకు దూసుకెళ్తున్నప్పటికీ, సమాజంలోని ఈ వర్గం మాత్రం ఇంకా మౌలిక హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర బిజెపి కురువ చిన్న మల్లయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ. కుటుంబం నుంచి మొదలై సమాజం వరకు, ప్రభుత్వం నుంచి ప్రజా రవాణా వ్యవస్థల వరకు వికలాంగులు ఎదుర్కొంటున్న వివక్ష అనేక రూపాల్లో బయటపడుతోంది.ముఖ్యంగా కుటుంబ వ్యవస్థలోనే వికలాంగులు మొదటి వివక్షను ఎదుర్కొంటున్నారు. "ఇతనికి ఏమీ చేతకాదు" అనే భావనతో తల్లిదండ్రులు, అన్నదమ్ములు, భార్యబిడ్డలు కూడా వారిని చిన్నచూపు చూస్తున్న సందర్భాలు పెరుగుతున్నాయి. శారీరకంగా బలహీనత ఉన్నా, మానసికంగా బలంగా నిలబడే అవకాశాలు ఇవ్వకుండా వారిని పూర్తిగా ఆధారపడే స్థితిలోకి నెట్టివేస్తున్నారు. పని చేయగల సామర్థ్యం ఉన్నా, అవకాశాలు ఇవ్వకపోవడం వల్ల వారు సమాజంలో తమ స్థానం కోల్పోతున్నారు.ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే, కొంతమంది వికలాంగులను కుటుంబ సభ్యులే బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లో వదిలి అడుక్కోవడానికి బలవంతం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజు మొత్తం అడుక్కున్న డబ్బులను సాయంత్రం ఇంటికి తీసుకెళ్లి, కనీస ఆహారం ఇచ్చి మళ్లీ మరుసటి రోజు అదే పరిస్థితిలోకి నెట్టడం అనేది అమానుషంగా మారింది. ఈ క్రమంలో వికలాంగులు శారీరకంగా మాత్రమే కాకుండా, మానసికంగా కూడా తీవ్రంగా కుంగిపోతున్నారు.ప్రభుత్వం అందిస్తున్న సహాయాలు కూడా పరిమితంగానే ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలకు కొంత పెన్షన్ ఇవ్వడం తప్ప, వికలాంగులకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో స్పష్టమైన ప్రణాళికలు కనిపించడం లేదు. స్వయం ఉపాధి కోసం అవసరమైన శిక్షణ, రుణ సదుపాయాలు, మార్కెట్ లింకేజీలు వంటి అంశాలు అందుబాటులో లేకపోవడం వల్ల వారు ఆర్థికంగా ఎదగలేకపోతున్నారు. రవాణా రంగంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. నగరాల్లో ఉచిత బస్సు పాస్‌లు ఉన్నప్పటికీ, అవి పూర్తిస్థాయిలో ఉపయోగపడడం లేదు. బస్సులు స్టాప్ వద్ద ఆగకపోవడం, ముందుకు వెళ్లి ఆపడం,వికలాంగులు ఎక్కే వరకు వేచి చూడకపోవడం వంటి సమస్యలు తరచూ ఎదురవుతున్నాయి. రెండు సీట్లు కేటాయించినా అవి ఎప్పుడూ అందుబాటులో ఉండవు. ఈ కారణంగా వికలాంగులు ప్రయాణంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఇదే సమయంలో, ఇతర వర్గాలకు విస్తృతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం, వికలాంగుల విషయంలో మాత్రం సమగ్ర దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సకలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ, వికలాంగులకు మాత్రం పరిమిత అవకాశాలు ఇవ్వడం అసమానతకు నిదర్శనంగా భావిస్తున్నారు.వికలాంగుల సాధికారత కోసం తక్షణ చర్యలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా:అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంవికలాంగులకు అనుకూలంగా మౌలిక వసతులు (రాంపులు, ప్రత్యేక సీట్లు) ఏర్పాటు చేయడంస్వయం ఉపాధి కోసం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టడంఉద్యోగాల్లో మరియు రాజకీయాల్లో కనీసం 5 శాతం రిజర్వేషన్ అమలు చేయడంకుటుంబాల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంఇవి అమలు చేస్తేనే వికలాంగులు గౌరవప్రదమైన జీవితం గడపగలరు.అంతేకాకుండా, వికలాంగులు తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాలను నిలదీస్తేనే మార్పు సాధ్యమవుతుందని భావిస్తున్నారు. లేకపోతే ఈ వర్గం మరింత వెనుకబడే ప్రమాదం ఉంది. మొత్తంగా చూస్తే, వికలాంగుల సమస్యలు కేవలం సంక్షేమ పథకాలతో పరిష్కారం కావు. సమాజంలో దృక్పథ మార్పు, ప్రభుత్వాల చిత్తశుద్ధి, మరియు వికలాంగుల సంఘటిత పోరాటం ఈ మూడు కలిసినప్పుడే వారికి న్యాయం జరుగుతుంది.

17

## భారీగా బ్యాటరీల దొంగతనం

### సీసీ ఫుటేజ్‌లో అనుమానితులు... వారెవరు.?

మహబూబ్‌నగర్, మార్చి 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ నగరంలోని హనుమాన్‌పురా ప్రాంతంలో భారీ స్థాయిలో బ్యాటరీల దొంగతనం ఘటన స్థానికంగా కలకలం రేపింది. కార్పొరేషన్ పరిధిలోని 29, 30వ డివిజన్లలో ఆటోలు, కార్లకు చెందిన సుమారు 25 బ్యాటరీలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ప్రాంతంలో వాహనాలను ఇళ్ల ముందు లేదా రోడ్డు పక్కన పార్క్ చేయడం ఆనవాయితీగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని దుండగులు రాత్రి వేళల్లో దాడికి దిగినట్లు తెలుస్తోంది. వాహనాల నుంచి బ్యాటరీలను సులభంగా తొలగించి తీసుకెళ్లడం వల్ల ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున దొంగతనం జరగడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది.ఈ ఘటన మార్చి 31 తెల్లవారుజామున 2 గంటల నుంచి 4:30 గంటల మధ్య జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఆ సమయంలో ప్రాంతంలో సంచరిస్తున్న కొందరు వ్యక్తులు సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించినట్లు తెలిసింది. దీంతో ఫుటేజ్‌లో కనిపిస్తున్న వారు ఎవరు? ఆ సమయంలో అక్కడ ఎందుకు తిరుగుతున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరిగిన వారి కదలికలు ఈ దొంగతనాలతో సంబంధం ఉన్నాయా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదే సమయంలో రాత్రిపూట పోలీస్ నిఘా లేకపోవడమే ఈ ఘటనకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై 1వ పట్టణ ఎస్ఐ సిన్నయ్య సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ విచారణ చేపట్టారు. ఫుటేజ్‌లో కనిపిస్తున్న అనుమానితుల గుర్తింపునకు చర్యలు కొనసాగుతున్నాయి. ఒకే ప్రాంతంలో, ఒకే రాత్రిలో ఇంత పెద్ద ఎత్తున బ్యాటరీలు మాయం కావడం వెనుక ప్రణాళికాబద్ధంగా పనిచేసే గ్యాంగ్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# వనపర్తి పురపాలిక బడ్జెట్‌కు ఆమోదం

- రూ. 55.31 కోట్ల అంచనా
- వెనుకబడిన వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యం
- సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం: తూడి మేఘా రెడ్డి




వనపర్తి ప్రతినిధి, మార్చి 31 (ప్రజాజ్యోతి): ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్నిక చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని స్థానిక శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది తమ పనితీరును మార్చుకుని నిబద్ధతతో పని చేయాలని ఆయన సూచించారు. వనపర్తి పురపాలికలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ. 55.31 కోట్ల సవరించిన వార్షిక అంచనా బడ్జెట్‌ను మున్సిపల్ కౌన్సిల్ మంగళవారం ఆమోదించింది. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మాధవి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు బడ్జెట్ వివరాలను సభ ముందుంచారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ రూ. 53.85 కోట్లు కాగా, 2026–27 సంవత్సరానికి రూ. 55.31 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో 10 శాతం నిధులను గ్రీన్ బడ్జెట్‌గా మొక్కల నాటకం, సంరక్షణకు కేటాయించినట్లు తెలిపారు. అలాగే బడ్జెట్‌లో మూడో వంతు వెనుకబడిన ప్రాంతాలు, మైనారిటీలు, బలహీన వర్గాలు నివసించే కాలనీలు, మురికివాడల అభివృద్ధికి వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం సవరించిన బడ్జెట్‌లో రూ. 36.46 కోట్లు ఆదాయంగా సమకూరగా, అందులో రూ. 28.03 కోట్లు అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. మిగిలిన రూ. 8.43 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఓపెనింగ్ బ్యాలెన్స్‌గా చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి మున్సిపాలిటీ రాష్ట్రంలో వెనుకబడి ఉందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. త్వరలో ప్రత్యేక మున్సిపల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బంది వివరాలు, అమృత్ 2.0 పనుల స్థితి, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, సీసీ కెమెరాలు, పార్కులు, మిషన్ భగీరథ వంటి అంశాలపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే టెండర్లు, అభివృద్ధి పనులు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డ్ సదుపాయాలపై వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. రోడ్లపై వ్యాపారం చేసే వారిని సమీకృత మార్కెట్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, దుకాణాల అద్దెలను తగ్గించినట్లు తెలిపారు. వెనుకబడిన వార్డులకు ప్రాధాన్యతనిస్తూ మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తామని చెప్పారు. పురపాలకంలో ప్రాపర్టీ పన్ను వసూళ్లు 100 శాతం చేయాలని, లక్ష్యం రూ. 5.50 కోట్లు కాగా, బకాయిలు రూ. 7 కోట్లు ఉన్నాయని గుర్తుచేశారు. నిధులు సమకూర్చుకోకపోతే కేంద్ర నిధులు పొందడం కష్టమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమృద్ధి టౌన్ షిప్ కు జాతీయ రహదారి శాఖ నోటీసులు...

### కొనుగోలుదారుల్లో ఆందోళన

### 40 ఫీట్ల రోడ్డుకు భారీ ధరలు చెల్లించిన వారికి ప్రమాద ఘంటికలు

జడ్చర్ల, మార్చి 31, ప్రజా జ్యోతి

నిబంధనలు అతిక్రమించి నూతన వెంచర్లు ఏర్పాటు చేశారన్న అంశం ఇటీవల తీవ్ర చర్చనీయాంశంగా మారడంతో పరిశీలించిన సంబంధిత శాఖ అధికారులు సదరు వెంచర్ నిర్వాహకులకు నోటీసులు అందించిన ఘటన జడ్చర్ల మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ఇలా. .... జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామపంచాయతీలో సర్వేనెంబర్ 601 లో ఏర్పాటుచేసిన వెంచర్ నిర్వాహకులకు ఇటీవల జాతీయ రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ మహబూబ్‌నగర్ డివిజన్ అధికారులు మార్చి 20న వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సుమారు 8.17 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఈ వెంచర్‌లో మొత్తం 30 రోడ్లు ఉన్నప్పటికీ, హైవే నుంచి ఒకే ఒక్క 40 ఫీట్ల రహదారికి నేరుగా అనుసంధానం ఉంటుందని భావించి పలువురు కొనుగోలుదారులు అధిక ధరలు చెల్లించి ప్లాట్లు కొనుగోలు చేశారు. ముఖ్యంగా ప్లాట్ నంబర్లు 14, 15, 21, 22, 27, 28, 29, 30, 32, 33, 56 నుంచి 64 వరకు ఉన్న 19 ప్లాట్ల యజమానులు ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు. హైవేతో కనెక్టివిటీ లేకపోతే తమ పెట్టుబడులు ప్రమాదంలో పడతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి అనుసంధానం లేకుండా ఉంటే ఈ ప్లాట్ల విలువ గణనీయంగా పడిపోవడమే కాకుండా, ప్రాపర్టీ వినియోగంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు వెంచర్ నిర్వాహకులు టి. శ్రీనివాస్ అండ్ అదర్స్‌కు నోటీసులు జారీ చేసి, వారం రోజుల లోపు వివరణ ఇవ్వాలని కోరారు. అయితే పది రోజులు గడిచినా నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం అధికారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయంపై మహబూబ్‌నగర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇందారపు రమేష్ మాట్లాడుతూ, "నిబంధనలకు విరుద్ధంగా హైవే అనుసంధానం కల్పించినట్లు ప్రాథమికంగా గుర్తించాం. మార్చి 20న నోటీసులు పంపించాం. వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని సూచించాం. ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదు. మరో రెండు రోజుల్లో రెండో నోటీసు జారీ చేయనున్నాం. అవసరమైతే తదుపరి చర్యలు కూడా తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సి ఉంది. ఈ పరిణామాలు రియల్ ఎస్టేట్ రంగంలో నిబంధనల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కొనుగోలుదారులు పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత అనుమతులు, రహదారి అనుసంధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ డి.ఎన్.సుమంత్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

నాగర్ కర్నూల్ : మార్చ్ 30 (ప్రజా జ్యోతి)

మార్చి 29న,జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఫిజియో తెరఫిస్ట్ డాక్టర్ సుమంత్ కు రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానం చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి గుర్తింపులో భాగంగా సామాజిక సేవలో విశేష కృషి చేసినందుకు డాక్టర్.సుమంత్ ఎంపిక అయ్యారు.నాగర్ కర్నూల్ లో ఫిజియోథెరపిని పరిచయం చేసిన తొలి వైద్యుడిగా డా.సుమంత్‌గుర్తింపు పొంది సేవా దృక్పథంతో ప్రజలకు అందుబాటులో చికిత్స అందిస్తున్నారు.అవార్డు ఎంపికలో సహకరించిన తెలంగాణ ఫిజియోథెరపీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు,నేషనల్ లైన్స్ క్లబ్ సభ్యులకు డాక్టర్.సుమంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## పదవీ విరమణ అనంతరం ప్రజాసేవకు ముందుకు రావాలి

- సేవా దృక్పథంతో పనిచేసినవారు సమాజానికి ఆదర్శం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి




**వనపర్తి ప్రతినిధి, మార్చి 31 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది తప్పనిసరి ప్రక్రియ అని, పదవీ విరమణ అనంతరం తమ శేష జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సూచించారు. వనపర్తి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన రవీంద్ర బాబు గారి పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్ర బాబు గారు మరియు వారి దంపతులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉద్యోగ జీవితంలో సేవా దృక్పథంతో పనిచేసిన వారు పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో విశేషంగా రాణించగలరని అన్నారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశం ఉన్నవారికి తాను ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన



- మహమ్మదాబాద్‌లో సదస్సు నిర్వహణ

మహమ్మదాబాద్, మార్చి 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యాధికారి రాజు నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని, విద్యపై దృష్టి సారించి మంచి భవిష్యత్తు సాధించాలని సూచించారు. ఆబ్కారీ శాఖ వలయాధికారి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. మెడికల్ ఆఫీసర్ శ్రీవాణి ఆరోగ్యపరమైన నష్టాలను తెలియజేస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహమ్మదాబాద్ సర్పంచ్ రామ్ లాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ కనబడుటలేదు



కొల్లాపూర్ మార్చి 31 ప్రజా జ్యోతి

కొల్లాపూర్ మండల పరిధిలో ఉన్న సింగోటం గ్రామ నివాసి పేరు ఎల్లమ్మ. ఈమె కుమారులు హైదరాబాదు నాగారం కాలనీలో ఉన్నారు, వాళ్లను చూడడానికి హైదరాబాదుకు రెండు రోజుల క్రితమే బయలుదేరింది, ఇప్పటివరకు ఆమె కొడుకుల దగ్గర చేరుకోలేదు ఇక్కడ సొంత గ్రామం అయినా సింగోటం గ్రామానికి చేరుకోలేదు. మధ్యలో ఎక్కడనో తప్పిపోయినది అని గ్రామస్తుల సమాచారం, ఆమె ఎవరికన్నా ఎక్కడైనా కనపడితేఈ క్రింద ఉన్న నెంబర్లకు తెలపగలరని గ్రామ స్థానికులు ప్రకటనలో వివరించారు. ఫోన్ నెంబర్లు,7997876351.9502880668. ఈ నెంబర్లకు సమాచారం ఇవ్వగలరని స్థానికులు వివరించారు.

## జర్నలిస్టు కట్ట ఉమా శంకర్ గౌడ్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసున్నజర్నలిస్టులు

**కొల్లాపూర్ మార్చి 31 ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కట్టా ఉమా శంకర్ గౌడ్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వారు తన స్వగ్రామానికి చేరుకోవడంతో జర్నలిస్టు కట్ట ఉమా శంకర్ గౌడ్ గారిని కొల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన టియుడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ నాయకులు వారి స్వగ్రామం సాతాపూర్ లో వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.జర్నలిస్టుగా సుదీర్ఘకాలం ఎన్నో సేవలు చేసి ఎంతోమందికి సహాయం చేసి నేడు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో విషయం తెలిసిన టియుడబ్ల్యూజే ఐజేయూ జర్నలిస్టు యూనియన్ నాయకులు కట్ట ఉమాశంకర్ గౌడ్ గారిని పరామర్శించి ఓదార్చారు ధైర్యంగా ఉండాలన్నారు.జర్నలిస్టులందరు అండగా ఉంటామని హామీనిచ్చారు.త్వరగా కొలుకొని జర్నలిస్టు గా సేవలందించలన్నారు.తనను పరామర్శించెందు కోసం వచ్చిన జర్నలిస్టులను చూసి కట్టా ఉమాశంకర్ గౌడ్ గారు కన్నీటి పర్యంతమయ్యారు నాకోసం మీరంతా రావడం సంతోషంగా ఉందన్నారు.జర్నలిస్టుల కోసం పోరాడాలని ఆయన కోరారు.



కార్యక్రమంలో. టి యు. డబ్ల్యూ. జె.(ఐ.జె.యు.)జిల్లా కార్యదర్శి రేసోజు సురేష్ కుమార్, కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మాలె.రాజేందర్ గౌడ్, కార్యదర్శి బొల్గాం వెంకటస్వామి,జిల్లా సహాయ కార్యదర్శి పి.వినోద్ కుమార్,జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఈసీ మెంబెర్ వెంకటేశ్వర చారి,శేఖర్ పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి.. "పదవీ విరమణ తప్పదు"

-- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ డ్రైవర్గా ప్రశంసా పత్రం అందజేత
-- బిజెపి రాష్ట్ర నాయకుడు మండికారి బాలాజీ
-- ఘనంగా పదవి విరమణ వీడ్కోలు సమావేశం

నాగర్ కర్నూల్ మార్చ్ 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

ఏ శాఖ లోనైనా విధులు నిర్వహిస్తున్న... ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదని రాష్ట్ర బిజెపి నాయకుడు, సామాజికవేత్త కవి.. ప్రముఖ చిత్రకారుడు మండికారి బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తూ, పదవి విరమణ పొందిన లింగం కృష్ణకు బిజెపి నాయకుడు మండికారి బాలాజీ డిపోలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగం కృష్ణయ్య తన సర్వీస్ లో 32 సార్లు ఉత్తమ కెఎంపిఎల్ సాధించి ఆర్టీసీ అధికారులచే ప్రశంస పత్రాలు నగదు బహుమతులు అందుకున్నారని ఈ సందర్భంగా మండికారి బాలాజీ గుర్తు చేశారు. అదేవిధంగా ఉత్తమ డ్రైవర్గా అప్పటి ఆర్టీసీ ఎండి సజ్జనార్తో ప్రశంసా పత్రాలు అందుకున్నారని వ్యాఖ్యానించారు. అదేవిధంగా బీసీ



సంఘం రాష్ట్ర నేత సాదే రాజు అభినందనలు తెలియజేశారు. అంతకుముందు బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో లింగం కృష్ణయ్య దంపతులకు గజమాలతో ఘనంగా సత్కరించారు. పదవి విరమణ పొందిన బాలస్వామి ఎడిసిలుగా పనిచేసిన వెంకటయ్య, తిరుపతయ్యలకు కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్టీసీ డిఎం పదవీ విరమణ పొందిన కుటుంబ సభ్యులు ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఎవరైనా మీ ఇంటి దగ్గరికి వచ్చి ఇంజక్షన్ వేస్తా అని చెప్పితే నమ్మవద్దు....

### ఎస్సై బండారి సురేష్

**కొల్లాపూర్ మార్చి 31 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ పట్టణ పరిధిలో ఉన్న చుట్టుముట్టు గ్రామాల ప్రజలకు కొల్లాపూర్ మండల ఎస్సై బండారి సురేష్ ప్రజలకు విజ్ఞప్తి, దొంగ ముఠాలు ఎయిడ్స్ ఇంజక్షన్లలో తయారుచేసి, గవర్నమెంట్ హాస్పిటల్ లో పనిచేస్తున్నామని పల్లెల్లో ఇండ్ల దగ్గరికి వచ్చి చెప్తారు, ఆ తరుణంలోనే ఎయిడ్స్ ఇంజక్షన్లను ప్రజలకు వేస్తున్నారుఈసమాచారం కొన్ని జిల్లాలలో ఉన్నది, ముందు జాగ్రత్తగా ఇక్కడ కూడా అలాంటి వారు ఎక్కడైనా ఉన్నారో ఉంటే ఆ దొంగ ముఠాల సమాచారం మాకు ఇవ్వండి. ఇంజక్షన్ పేరుతో మీ ఇంటి దగ్గరికిఎవరైనా వచ్చి మేము గవర్నమెంట్ హాస్పిటల్ నుంచి వచ్చాము అని చెప్పి ఇన్సులిన్ విటమిన్స్ ఇంజక్షన్ వేస్తామని చెప్తే, మీరు తొందరపడి ఆ ఇంజక్షన్లను వేయించుకోవద్దు, ఎందుకంటే టెర్రరిస్టులగా




గ్రూపులు తయారయ్యి ఈ విధంగా వచ్చి ఎయిడ్స్ ఇంజక్షన్లను వేస్తున్నారు సమాచారం మాకు ఉన్నది అని ఎస్ఐ వివరించారు. ఇంకా మీరు జాగ్రత్త ఉండండి పల్లెల్లో జాగ్రత్త పడండి మీ యొక్క బంధువులకు మీయొక్క చుట్టుముట్టు పక్కల ప్రాంతాల ప్రజలకు గాని ఒకరికి ఒకరు సమాచారం తెలుపగలరని ఎస్సై బండారి సురేష్ ప్రకటనలో తెలిపారు.



## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా శంకర్ నాయక్

గండీడ్ మార్చ్ 31 (ప్రజా జ్యోతి) బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా శంకర్ నాయక్ నియమించడం జరిగింది ఆయన బిజెపి మండల అధ్యక్షుడు నుండి ఎన్నో ఉన్నతమైన పదవులను అధిరోహిస్తూ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎదగడం గర్వకారణమని మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి అన్నారు మంగళవారం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో గీరమని శ్రీనివాస్ కుడుముల రాజు మల్కయ్య నరహరెడ్డి రఘు బిజెపి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

## బీజేఆర్, అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చి 31 (ప్రజా జ్యోతి)**

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని, అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఏప్రిల్ 5 న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, 14 న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతేడాది జయంతి వేడుకలను ఎలా నిర్వహించారో.. ఈ సారి అలాగే నిర్వహించాలని ఏర్పాట్లలో ఎక్కడా చిన్న పొరపాటు జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పరంగా అధికారికంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఈ నెల 5 న జిల్లా కలెక్టరేట్ లోనే నిర్వహిస్తామని, 14 న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతిని జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ చౌరస్తా లో నిర్వహించడం జరుగుతుందని ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్ జిల్లా కలెక్టర్ కు తెలిపారు. కాగా సమావేశంలో పాల్గొన్న పలువురు దళిత సంఘాల సభ్యులు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. గతంలో విగ్రహ ఏర్పాటు కు మున్సిపల్ లో కౌన్సిల్ తీర్మానం కూడా చేయడం జరిగిందని వారు తెలపగా, పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని మరి కొందరు సభ్యులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు, ప్రభుత్వ అనుమతులతో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందాం అని కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ పరంగా అంబేద్కర్ జాతర కు ఎలాంటి నిధుల ప్రొవిజన్ లేదని, జయంతిని మాత్రమే ప్రభుత్వ పరంగా అధికారికంగా నిర్వహించడం జరుగుతూ వస్తుందని ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్ కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫణింద్ర రెడ్డి, శ్రీను, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం. ఏ. రషీద్, కౌన్సిలర్ మహేష్, జయశ్రీ, దళిత సంఘాల సభ్యులు శరణప్ప, ఈశ్వరమ్మ, మహా దేవ్ తదితరులు పాల్గొన్నారు.

## భీమలింగేశ్వర ఆలయంలో పుస్తకావిష్కరణ

కల్వకుర్తి, మార్చి 31 ( ప్రజా జ్యోతి ) : కల్వకుర్తి పట్టణంలోని శ్రీ భీమలింగేశ్వర ఆలయంలో మంగళవారం భక్తకవి కర్నాటి రఘురాములు రచించిన "రఘురామ దాస భజన కీర్తనలు" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో ఆధ్యాత్మికతతో కూడిన కీర్తనలను ప్రాధాన్యం ఉంటుందని వారు తెలిపారు. ఇప్పటికీ 30 పుస్తకాలను ముద్రించానని రచయిత తెలిపారు కల్వకుర్తి ప్రాంతానికి చెందిన మురళీధర్ రెడ్డి వారి తల్లిదండ్రుల స్మారకార్థం పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందింపజేసి మంచికి దగ్గర చేయడమే ప్రధాన ఉద్దేశం అని రచయిత తెలిపారు. ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరు చదివి రచయితను ఆదరించాలని వారు కోరారు. ఆలయ కమిటీ సభ్యులు రచయితను ఘనంగా శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాజు,కిష్టారెడ్డి, రాధాకృష్ణ, శ్రీనివాసులు, అంజిరెడ్డి, కర్ణాకర్, గజ్జలయ్య, సత్యం,మల్లేష్, రమేష్, లింగం, శ్రీశైలం, భజన బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

